# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 15 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4





భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుని విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ , పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , పలువురు నేతలు పాల్గొని బాబాసాహెబ్ గారి సామాజిక సమానత్వ సందేశాన్ని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




# ఆధార్ తరహాలో భూధార్

- ప్రతి భూ కమతానికి ఓ ప్రత్యేకమైన నంబర్
- భూ వివాదాలు లేని తెలంగాణే లక్ష్యం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టేందుకే కొత్త చట్టం
- ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులదే
- భూ భారతి ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మనుషుల గుర్తింపు కోసం కేంద్రం తీసుకొచ్చిన ఆధార్ కార్డులా భవిష్యత్‌లో ప్రతి భూమికి కచ్చితమైన సరిహద్దులతో రిజిస్ట్రేషన్ చేసేలా భూమి గుర్తింపు కోసం భూధార్ విధానాన్ని తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రెవెన్యూ యంత్రాంగాన్ని కోరారు. తెలంగాణలో వివాద రహిత భూ విధానాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమని స్పష్టం చేశారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకొస్తామని ప్రకటించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి శుభసందర్భంగా ప్రభుత్వం నూతనంగా తెచ్చిన భూ భారతి చట్టం, భూ భారతి పోర్టల్‌ను ముఖ్యమంత్రి శిల్ప కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

"పైలట్ ప్రాజెక్టుగా తొలి విడతా భూ భారతిని నాలుగు మండలాల్లో చేపడుతాం. ప్రజా పోరాటాల నుంచి పుట్టుకొచ్చిన రెవెన్యూ చట్టాలు, ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉంది. రెవెన్యూ అధికారులను ప్రజలకు చేరువ చేయాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. గత పాలకుల తరహాలో రెవెన్యూ సిబ్బందిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ఆలోచనకు ప్రజా ప్రభుత్వం వ్యతిరేకం. అవినీతికి పాల్పడే వ్యక్తులపైన కఠినంగా వ్యవహరిస్తాం. కానీ వ్యవస్థపై కాదు. ఎంతో మంది అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి భూములకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో భూ భారతి చట్టం తెచ్చాం.

ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి విజ్ఞప్తులను తీసుకుని వాటిని పరిష్కరించాలి. ప్రభుత్వలక్ష్యం నెరవేరాలంటే రెవెన్యూ సిబ్బంది మాత్రమే ఆ పనిని చేయగలరు. రెవెన్యూ సిబ్బంది రైతాంగాన్ని రెండు కళ్ల లాంటి వారు. రెవెన్యూ శాఖపైన కొందరు సృష్టించిన అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.?గ్రామాలు, మండలాల్లో ప్రజా దర్బార్లు, రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించాలి. అందరి సహకారంతో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయండి. ఈ చట్టాన్ని గ్రామాలకు తీసుకెళ్లండి.." అని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసనసభాపతి గడ్డం ప్రసాద కుమార్ గారు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ఇతర మంత్రివర్గ సహచరులు, మిగితా 2వ పేజీలో

## భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలి

- సీఎం రేవంత్‌రెడ్డి


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**




రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు నిర్దేశించారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలని, ప్రతి కలెక్టర్ మండల స్థాయి సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్థమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపాలని చెప్పారు. మిగితా 2వ పేజీలో

# అడవులపైకి బుల్డోజర్లా...?

- ఇచ్చిన హామీలు మరిచిన తెలంగాణ ప్రభుత్వం
- ప్రకృతి, జంతువులను ప్రమాదంలో పడేసేలా చర్యలు
- రేవంత్ ప్రభుత్వంపై ప్రధాని మోడీ విమర్శలు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోయి అడవులను నరికి పర్యావరణాన్ని.. వన్యప్రాణులను నాశనం చేస్తుంది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవులపై బుల్డోజర్లను పంపుతుంది.. ఇది కాంగ్రెస్ మోడల్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీజేపీ మంచి పనులు చేయాలని చూస్తుంటే కాంగ్రెస్ ఉన్న అడవులను నాశనం చేస్తుంది' అని మండిపడ్డారు. హరియాణాలోని హిసార్‌లో 'మహారాజ అగ్రసేన్ ఇంటర్నేషనల్' విమానాశ్రయాన్ని ప్రధాని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఓ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు నమ్మక ద్రోహానికి గురవుతున్నారని విమర్శించారు. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తాము పూర్తిగా అమలు చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో అక్కడి ప్రభుత్వాలు విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేసేలా, జంతువులను ప్రమాదంలో పడేసేలా వ్యవహరిస్తోంది. అడవుల్ని ధ్వంసం చేస్తోంది. వాటిపై బుల్డోజర్లు ప్రయోగిస్తోంది..'అని మోదీ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌లోనూ అభివృద్ధి, సంక్షేమం అటకెక్కిందన్నారు. కర్ణాటకలో కరెంట్ నుంచి పాల దాకా, బస్సు చార్జీల నుంచి విత్తనాల వరకు ప్రతిదాని రేట్లు పెరిగాయని ప్రధాని మండిపడ్డారు. అక్కడి సీఎం అవినీతిలో దేశంలోనే నంబర్ వన్‌గా ఆ రాష్ట్రాన్ని నిలిపారని ఆరోపించారు. బీజేపీది అభివృద్ధి మోడల్ అయితే, కాంగ్రెస్‌ది అబద్ధాల మోడల్ అని విమర్శించారు.

## ప్రధాని నిరాధార ఆరోపణలు మానుకోవాలి

- బీజేపీ ప్రభుత్వాలే కార్పొరేట్ ప్రయోజనాల కోసం అటవీ ప్రాంతాలను నాశనం చేశాయి
- అహ్మదాబాద్‌లలో 17,000 చెట్లు నరికివేత
- దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 1.09 లక్షల చెట్లు నరికారు.
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



వివరాలు 2వ పేజీలో

# గిగ్ వర్కర్లకు శుభవార్త




- వారి భద్రత కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు ముసాయిదాను ప్రజాభిప్రాయానికి అందుబాటులో ఉంచాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గిగ్ వర్కర్ల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ దిశగా అంబేద్కర్ జయంతి సందర్భంగా గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్-2025 యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుకు రూపకల్పన చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ చట్టం తెలంగాణ రాష్ట్రమంతటా వర్తిస్తున్నదని పేర్కొన్నది. ఇది ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించిన తేదీన అమల్లోకి రానున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కర్లతో పాటు ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న వారికి వర్తిస్తుందని వెల్లడించారు.

గిగ్ వర్కర్లకు భద్రత కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు ముసాయిదాను వెంటనే ప్రజాభిప్రాయానికి అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది ముసాయిదాను రూపొందించాలని సూచించారు. గిగ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం, ఇతర హక్కులను కల్పించేలా కార్మిక శాఖ రూపొందించిన ముసాయిదా "తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫామ్ వర్కర్స్ బిల్లు"లో పొందుపరిచిన అంశాలను అధికారులు సమావేశంలో ముఖ్యమంత్రి గారికి వివరించారు. ముసాయిదాలో ముఖ్యమంత్రి పలు మార్పులు చేర్పులను సూచించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యతను ఇవ్వటంతో పాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయం, సుహృద్భావం ఉండేలా కొత్త చట్టం ఉండాలని చెప్పారు. ఈ బిలు మిగితా 2వ పేజీలో

# ఎస్సీ వర్గీకరణ అమలు



**జీఓ తొలి కాపీని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసిన మంత్రులు**

**ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నెరవేర్చింది కాంగ్రెస్సే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం ద్వారా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సామాజిక న్యాయాన్ని సాధించేందుకు కీలకమైన అడుగు వేసింది. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, ఎస్సీ వర్గీకరణ జీవోను విడుదల చేశారు. ఈ జీవోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు.

అనంతరం మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు . సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు వెలువరించిన తర్వాత, తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. అసెంబ్లీలో అన్ని పార్టీల సభ్యులు ఈ అంశంపై చర్చించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే దీనిని అమలు చేసింది. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని ఉప కులాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉప సమూహాన్ని మినహాయించకుండా, సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు .

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎక్కువ ప్రతిపాదనలు స్వీకరించి, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలపై అధ్యయనం చేసి తుది నివేదికను సమర్పించింది . ఎస్సీ వర్గీకరణ ఈ రోజు నుంచి అమల్లోకి వస్తుందని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. దళితుల్లో సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఉండకూడదని ఆకాంక్షించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కొన్ని వేల విజ్ఞప్తులను స్వీకరించి వాటిని అధ్యయనం చేశామని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో ఇకపై వచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అమలవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు నుంచి భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ చర్యల ద్వారా తెలంగాణ రాష్ట్రం సామాజిక న్యాయాన్ని సాధించడంలో ముందడుగు వేసింది. ఎస్సీ వర్గీకరణ అమలుతో దళితులకు సమాన అవకాశాలు కల్పించి, వారి అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటోంది.

ఎస్సీ వర్గీకరణ అమలుపై దామోదర మాట్లాడుతూ వర్గీకరణ ఏ కులానికీ వ్యతిరేకం కాదనీ, దళితుల్లో ఉన్న అంతర్గత వెనుకబాటుతనం, అసమానతలను తొలగించేందుకేనని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన ఎనిమిదిన్నర నెలల్లోనే వర్గీకరణను అమల్లోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. "వారి త్యాగాలను ఎల్లకాలం గుర్తుంచుకుని, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు, ఎంపిరికల్ డేటా, విద్య, ఉద్యోగ అవకాశాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయపరమైన స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని వర్గీకరణ చేపట్టామని తెలిపారు. "59 షెడ్యూల్డ్ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్లను కేటాయించాలని వన్ మ్యాన్ కమిషన్ సూచించింది. మిగితా 2వ పేజీలో



## నాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే


- లేదంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మంత్రివర్గంలో తనకు చోటు లేకుంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే అని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై ప్రేమ్‌సాగర్ రావు మండిపడ్డారు. ఇంద్రవెల్లి సభతో పార్టీకి ఊపిరిపోశానని గుర్తు చేశారు. అధిష్టానం తనకు అన్యాయం చేస్తే సహించనని స్పష్టం చేశారు. పదేళ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా గౌరవం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి వేడుకల్లో ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ . బీఆర్ఎస్, బీజేపీ అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు కూడా ఇవాళ మంత్రి పదవి అడుగుతున్నారని సెటైర్లు వేశారు. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు తనను టార్గెట్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఓ కుటుంబం మంత్రి పదవి రాకుండా నా గొంతు కోసేందుకు ప్రయత్నిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జై బాబు జై భీమ్ జై సమ్మిదాన్ సభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలోనే ప్రేమ్ సాగర్ రావు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## రుణగ్రహీతలకు ఎస్‌బీఐ శుభవార్త

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో, ఎస్బీఐ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఎస్బీఐ రెపో లింక్డ్ లెండింగ్ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తగ్గింపుతో రెపో లింక్డ్ రేటు 8.25 శాతానికి చేరుకుంది. అలాగే, ఎక్స్టర్నల్ బెంచ్ మార్కు ఆధారిత లెండింగ్ రేటును కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇది 8.65 శాతానికి చేరింది. సవరించిన వడ్డీ రేట్లు మంగళవారం (నేటి) నుంచి మిగితా 2వ పేజీలో

# 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే..

- సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన ప్రభుత్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి తమదేనని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆన్‌లైన్ ద్వారా కోర్టుకు ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ భూములపై ఈ నెల 16వ తేదీన(రేపు) సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని భూములు ప్రభుత్వ భూములేనని అందులో పేర్కొంది. ఈ భూముల్లోనే కేంద్రీయ విశ్వవిద్యాలయం, మరికొన్ని సంస్థలు, బస్టాండ్ వంటివి వచ్చాయని తెలిపింది. సుమారు 20 ఏళ్లకు పైగా ఈ 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉండటంతో అక్కడ చెట్లు మొలిచి అటవీ ప్రాంతంగా మారిందని అఫిడవిట్‌లో పేర్కొంది.

కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్న వృక్షాలను నరికివేసి, భూమి వేలం వేసేందుకు సరార్ సిద్ధంకాగా హెచ్‌సీయూ విద్యార్థులు, పౌర సమాజం తీవ్రం గా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. జీవవైవిధ్యం గల ప్రాణులు, వృక్షాలను, ఆవాసాలను ధ్వంసం చేయటంపై తీవ్రంగా ఆగ్రహించిన సర్వోన్నత న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి పనులు చేయవద్దని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కేంద్ర సాధికార కమిటీని నియమించింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 16న జరగనుండగా.. సీఎస్ శాంతికుమారి, ఆమె అధికారుల బృందం రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపుల జరిపిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు.

# ఆధార్ తరహాలో భూధార్

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రైతు కమిషన్ చైర్మన్, సభ్యులతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ కమిటీలను పునరుద్ధరిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మోఖా మీద సాగు చేసుకుంటున్న అర్హత కలిగిన పేదవారికి ప్రభు త్వం పట్టాలు పంపిణీ చేస్తుందని వెల్లడించారు. గత పాలకులు పదేండ్లలో పేదలకు ఒక్క ఎకరం పంచలేదని విమర్శించారు. దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాటాలు జరుగగా, తెలంగాణలో మాత్రం భూమి కోసం పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. దున్నేవాడికే భూమి కావాలని పోరాటం నుంచి వచ్చిందే టెనఎన్సీ చట్టమని పేర్కొన్నారు.ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణారావు టెనఎన్సీ చట్టం తీసుకొచ్చారని అన్నారు. నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో ప్రజలకు అన్ని హక్కులు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భట్టి పేర్కొన్నారు రాష్ట్ర ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే భూభారతి చట్టాన్ని ప్రజలకు అందించడంతో జన్మధన్యమైందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్య నలుగురు కలిసి రూపొందించిన 2020 రెవెన్యూ చట్టం- ధరణితో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిందని చెప్పారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్‌గా ఖమ్మం, మహబూబ్‌నగర్, ములుగు, కామారెడ్డి జిల్లాలను ఎంపిక చేశామని చెప్పారు. మే మొదటివారంలో రాష్ట్రంలో మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి ప్రజల నుంచి సమస్యలను స్వీకరిస్తామని తెలిపారు. అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తారని వెల్లడించారు. ఈనెల 17 నుంచి కలెక్టర్లు రాష్ట్రంలో అన్ని మండలాల్లో ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తారని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని అవసరమైన మార్పులు చేసి జూన్2 నాటికి సమగ్ర చట్టాన్ని అందుబాటులోకి తెస్తామని వివరించారు.

# ప్రజావాణిలో పారదర్శకమైన విధానాలు అమలు చేయాలి

● **ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రజల అర్జీలను పరిష్కరించడంలో విజయవంతంగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో మరింత పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజాభవన్‌లో కొనసాగుతున్న ప్రజావాణి డ్యాష్ బోర్డుతో అనుసంధానం చేయాలని చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో వారంలో రెండు రోజులు కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంపై డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి గారు సమీక్షించారు. ప్రజలు ఇప్పటివరకు సమర్పించిన అర్జీలు, వాటిల్లో పరిష్కారమైనవి, పరిష్కారానికి అధికారులు అనుసరిస్తున్న విధానాలను ముఖ్యమంత్రి సమీక్షించారు.

2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 117 సార్లు ప్రజావాణి నిర్వహించగా, అందులో 54,619 అర్జీలను ప్రజలు నమోదు చేసుకున్నారు. వీటిలో 68.4 శాతం (37,384) అర్జీలు పరిష్కారమయ్యాయని అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు. అర్జీల వివరాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వాటి అమలు పురోగతి పారదర్శకంగా అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఉండేలా ఈ పోర్టల్ రూపొందించాలని సూచించారు.

వివిధ విభాగాలకు ప్రజావాణిలో ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశామని, గల్ఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అత్యవసరమైన అర్జీలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామని, అంబులెన్స్ సదుపాయం కూడా ప్రజావాణి జరిగే రోజుల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్‌ను తనకు అందించాలని, తనకు లైవ్ యాక్సెస్ ఉండేలా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. తద్వారా తాను ఎక్కడ ఉన్నా ప్రజావాణి అర్జీల పరిష్కారం తీరును, ప్రజల నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందని, అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేయటం సులభమవుతుందని అన్నారు.

ప్రజల వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది లేకుండా అమల్లో ఉన్న చట్టాల ప్రకారం ఏయే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి, వేటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలనేది ముందుగా సమీక్షించుకోవాలన్నారు. అధికారుల స్థాయిలో కమిటీ వేసి అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య గారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, వేసవి తాగు నీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి గారు దిశానిర్దేశం చేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ సలహాదారులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లను తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, ఈ రెండింటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. భూ భారతి చట్టాన్ని కలెక్టర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని, గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను న్యాయస్థానాలకు పంపారని, భూభారతి చట్టంలో రెవెన్యూ యంత్రాగమే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, అప్పీల్ వ్యవస్థ ఉన్న విషయాన్ని రైతులు, ప్రజలకు వెల్లడించాలని తెలిపారు.

భూ భారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణపేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని, ఆయా మండల కేంద్రాల్లో సదస్సులకు కలెక్టర్లు కచ్చితంగా హాజరుకావాలని, ఆయా మండలాల్లో ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఆయా సదస్సులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గారు, ఇతర మంత్రులు హాజరవుతారని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున గ్రామ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు ఆమోదం పొందిన జాబితాను మండల స్థాయి కమిటీలు పరిశీలించాలని సీఎం సూచించారు. ఆ కమిటీల పరిశీలన అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి పంపాలని.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాకే ఇండ్ల జాబితా ఖరారవుతుందని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. ఈ వ్యవహారం సక్రమ పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని ఆదేశించారు. ఈ ప్రత్యేకాధికారి ఇందిరమ్మ కమిటీలు, మండల కమిటీలు, కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రి మధ్య సమన్వయకర్తగా ఉంటారని చెప్పారు.

వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో నీటి పారుదల శాఖ, తాగు నీటి సరఫరా శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు, సరఫరాపై పర్యవేక్షించాలని చెప్పారు.

# ఎస్సీ వర్గీకరణ అమలు

(మొదటి పేజీ తరువాయి)

రిపోర్ట్ ఆధారంగా అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూపు 1లో చేర్చి, వారికి 1 శాతం రిజర్వేషన్ కేటాయించాం. రిజర్వేషన్ల ద్వారా మధ్యస్తంగా ప్రయోజనం పొందిన 18 కులాలను గ్రూపు 2లో చేర్చి, వీరికి 9 శాతం రిజర్వేషన్ కేటాయించాం. మెరుగైన ప్రయోజనం పొందిన 26 కులాలను గ్రూప్ 3లో చేర్చి, వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించాం. మొత్తం 59 కులాల్లో 33 కులాలు పాత వర్గీకరణలో ఏ గ్రూపులో ఉన్నాయో, కొత్త వర్గీకరణలోనూ అదే గ్రూపులో కొనసాగుతు న్నాయి. 26 కులాలు మాత్రమే మార్పులకు గురయ్యాయి. మొత్తం ఎస్సీల జనాభాలో 26 కులాల జనాభా 3.43 శాతం మాత్రమే. 2026 జనాభా లెక్కల తర్వాత, ఎస్సీల జనాభాకనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్లను పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని దామోదర రాజనర్సింహ వివరించారు. రిజర్వేషన్ల ప్రకారమే రాబోయే రోజుల్లో ఉద్యోగాల భర్తీ చేపడుతామని వెల్లడించారు. త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు రానున్నాయని తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగాలను సాధించుకునేందుకు యువత సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తించబోదని స్పష్టం చేశారు.

ఎస్సీలకు ప్రభుత్వ ఉద్యోగాలను సమాన పద్ధతిలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రిఫరెన్షియల్ విధానాన్ని అమలు చేయనుంది. వర్గీకరణ అమలు మొదలైన నేపథ్యంలో సర్కార్ ఈ విధానాన్ని ఎంచుకుంది. ఇప్పటికే వికలాంగులకు ఉద్యోగాల్లో ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఎస్సీల్లోని గ్రూప్-1 కులాలకు నోటిఫై చేసిన ఖాళీలు భర్తీ కాకుంటే తదుపరి ప్రాధాన్యం కలిగిన గ్రూప్-2 కేటగిరీలోని అర్హులైన అభ్యర్థులతో ఆ పోస్టులను భర్తీ చేస్తారు. ఒకవేళ గ్రూప్-2లో సరైన అభ్యర్థులు లేకుంటే గ్రూప్-3లోని అభ్యర్థులతో భర్తీ చేస్తారు.గ్రూప్-1,2,3 మూడింటిలోనూ సరైన అభ్యర్థులు లేకుంటే ఆ పోస్టులను క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. ప్రస్తుతం ఈ ప్రిఫరెన్షియల్ విధానం వికలాంగుల కేటగిరీలోని అభ్యర్థుల కు అమలవుతోంది. ఈక్రమంలో ఎస్సీ వర్గీకరణను ప్రారంభించడం వల్ల ఈ విధానాన్ని ఎస్సీ అభ్యర్థులకూ అమలు చేసేందుకు వీలుగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్లు కీలకం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, వికలాంగుల రిజర్వేషన్ల శాతాల ప్రకారం ఇవి ఉంటాయి. అయితే ఎస్సీల వర్గీకరణపై ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ రోస్టర్ పాయింట్లను గ్రూపుల వారీగా విభజించింది. ప్రతిపాదిత రిజర్వేషన్ల ప్రకారం కేటాయించింది. దీని ప్రకారం గ్రూప్-1కు ఒకటి, గ్రూప్-2కు తొమ్మిది, గ్రూప్-3కు ఐదు రోస్టర్ పాయింట్లు రానున్నాయి.

# ప్రధాని నిరాధార ఆరోపణలు మానుకోవాలి

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ కన్చ గచ్చిబౌలిలోని భూములపై తెలంగాణ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానేసి, రాష్ట్ర బీజేపీ నాయకులు ఆయనకు అందజేసిన సమాచారం అన్నింటిని అర్థం చేసుకోకుండా అనుకరించకూడదని అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని 'అరణ్యవనం'ను తెలంగాణ ప్రభుత్వం నాశనం చేసిందన్న ప్రధాని ఆరోపణలకు సమాధానంగా గౌడ్ చెప్పారు - అక్టోబర్ 2023లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మోదీ ప్రారంభించిన ఐదు కొత్త భవనాలకు మునిసిపల్, అటవీ, పర్యావరణ అనుమతులు లేవని ఆయన గుర్తు చేశారు. ఆ భవనాల నిర్మాణ సమయంలో ఎన్ని చెట్లు నరికి వేసారో మోదీ అడిగారా? అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వాలే కార్పొరేట్ ప్రయోజనాల కోసం అటవీ ప్రాంతాలను వ్యవస్థబద్ధంగా నాశనం చేశాయని అన్నారు. గాంధీనగర్, అహ్మదాబాద్‌లలో 17,000 చెట్లు నరికి వేసినట్టు, దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 1.09 లక్షల చెట్లు నరికినట్టు ఉదాహరణగా చెప్పారు. అదే సమయంలో లక్షల ఎకరాల అటవీ భూమిని పారిశ్రామిక దిగ్గజాలకు కేటాయించడం ద్వారా పర్యావరణంపై నిర్లక్ష్యం చూపారని ఆరోపణ చేశారు.

తెలంగాణ విజయాలను కప్పిపుచ్చేందుకు, కాంగ్రెస్ ప్రభుత్వ పేదల పక్షాన అమలు చేస్తున్న పథకాలను జీర్ణించుకోలేక బీజేపీ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున బియ్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబసభ్యులు, రైస్ మిల్లర్లతో కలిసి మోట బియ్యాన్ని గొప్ప బియ్యంగా మార్చడంలో పాల్గొన్నారని ఆరోపించారు. " బియ్యం పంపిణీపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కే లేదు. తమ కుంభకోణాలను మర్చిపోయారా?" అని ప్రశ్నించారు.

### రుణగ్రహీతలకు
# ఎస్‌బీఐ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

అమల్లోకి వస్తాయని ఎస్బీఐ తెలిపింది. ఈ నిర్ణయం ఇప్పటికే రుణాలు తీసుకున్న వారితో పాటు, కొత్తగా రుణాలు తీసుకునే వారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు మరియు ఇతర రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి.

ఎస్బీఐ డిపాజిట్ రేట్లను కూడా సవరించింది. డిపాజిట్లపై సుమారు 10 నుంచి 20 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గించింది. రూ. 3 కోట్ల వరకు ఫిక్స్డ్ డిపాజిట్లపై 1-2 సంవత్సరాల కాలవ్యవధికి వడ్డీని 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.70 శాతానికి చేర్చింది.

2-3 సంవత్సరాల కాల వ్యవధిపై వడ్డీ రేటును 7 శాతం నుంచి 6.90 శాతానికి తగ్గించింది. రూ. 3 కోట్ల కంటే ఎక్కువ ఫిక్స్డ్ డిపాజిట్లపై 180 రోజుల నుంచి 210 రోజుల కాలవ్యవధిపై 20 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.40 శాతానికి సవరించింది.

# గిగ్ వర్కర్లకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ముసాయిదాను వెంటనే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి, ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్స్ డ్రైవర్లు, ప్యాకేజ్ డెలివరీల్లో దాదాపు 4 లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని, అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. ముసాయిదాలో పొందుపరిచిన అంశాలపై తుది కసరత్తు చేయాలని, అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఈనెల 25వ తేదీ నాటికి బిల్లు తుది ముసాయిదాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసే అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మే డే రోజున ఈ బిల్లును అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫామ్ వర్కర్ల భద్రతకు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. దేశంలోనే మొదటి సారిగా గిగ్ వర్కర్లకు ప్రమాద బీమాను అమలు చేశామని చెప్పారు. గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లు మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమాను అందించేలా 2023 డిసెంబర్ 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొత్తగా అమలు చేసే చట్టం కూడా దేశానికి తెలంగాణ మార్గదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిపేట మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంతో పాటు చుట్టుపక్క గ్రామాలలో అంబేత్కర్ 134వ జయంతి వేడుకలను వివిధ పార్టీల నాయకులు సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, రాచర్ల గొల్లపెల్లి గ్రామంలో ఆయన విగ్రహాన్ని ప్రత్యేకమైన వాహనంలో అలంకరణ చేసి పురవీధుల గుండా డీజే డప్పు చప్పులతో మహిళలు, పిల్లలు నృత్యలు చేస్తూ ఊరేగింపు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... భారతదేశ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేరు డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్. కేవలం ఒక న్యాయవాదిగానో, రాజ్యాంగ నిర్మాతగానో మాత్రమే కాకుండా, ఒక గొప్ప సంఘ సంస్కర్తగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన నిలిచిపోయారు.ఆయన జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిచ్చే ఒక అద్భుత గాథ 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని ఒక మారుమూల గ్రామంలో జన్మించిన అంబేద్కర్, చిన్ననాటి నుంచే కుల వివక్షను తీవ్రంగా అనుభవించారు. అంటరాని కులంలో పుట్టడం వల్ల పాఠశాలలో ఆయనను మిగతా విద్యార్థులతో పాటు కూర్చోనివ్వలేదు. మంచినీరు తాగడానికి కూడా అనుమతి ఉండేది కాదు. కానీ, ఈ అవమానాలే ఆయనను మరింత దృఢ సంకల్పుడిగా మార్చాయి.

అసాధారణమైన మేధాశక్తి కలిగిన అంబేద్కర్, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తన చదువును కొనసాగించారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆయన ఎన్నో కష్టాలు పడ్డారు. బరోడా మహారాజు సాయంతో కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదివి అర్థశాస్త్రం, న్యాయశాస్త్రం మరియు రాజనీతి శాస్త్రాలలో అత్యున్నత డిగ్రీలు పొందారు. ఆయన జ్ఞాన సంపద అపారమైనదని వారు కొనియారారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, వివిధ కులాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాలలో పాల్గొని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూమాల వేసి, ఘన నివాళులు అర్పించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్.అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ: ప్రపంచ మేధావి డా.బి ఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి స్ఫూర్తి అంబేద్కర్ రాజ్యాంగం అని అన్నారు. ఈ రోజున అన్ని వర్గాల ప్రజలు సమానంగా ఫలాలు అనుభవిస్తున్నారంటే అది అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగ ద్వారానేనని, సమాజంలోని అన్నివర్గాల ప్రజల కోసం కులాలకు, మతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని అందించిన మహానుబావుడు అంబేద్కర్ అని,వారి సేవలను కొనియాడారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..





**-భారతరత్న బీఆర్ అంబేద్కర్ అందరివారు**
**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పేద ధనిక తేడా లేకుండా అందరూ సన్న బియ్యం తినాలని మహొన్నత ఉద్దేశంతో పథకాన్ని అమలు చేస్తుందని ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేద్కర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహించగా ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప తదితరులు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత , భారతరత్న బీఆర్ అంబేద్కర్ అందరివారని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామం, పట్టణంలోనే కాకుండా పలు దేశాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణం అని, అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని,ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లో ఈ స్థాయికి ఎదిగాననిఅన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బిల్లు రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని, రాష్ట్ర శాసనసభలో బీసీ బిల్లును బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రవేశపెట్టారని, దానిని బలపరిచే అవకాశం బీసీ బిడ్డగా తనకు రావడం మర్చిపోలేని మంచి అనుభూతి అని అన్నారు.ఎస్సీ వర్గీకరణ కూడా అమలు కానుందని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్మాణానికి ఒక ఎకరం భూమి, నిధులు మంజూరు చేస్తామని,జిల్లాలోని ఎస్సీల సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సంఘాల నాయకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, అర్హులైన ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తుందని, మహిళలందరికీ ఉచితంగా బస్సు సేవలు అందిస్తుందని అన్నారు. నేత కార్మికుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేసుకున్నామని, నేతన్నలందరికీ ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో చీరలు ఉత్పత్తికి ఆర్డర్ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం లో వివిధ శాఖలకు అవసరమయ్యే అన్ని ఆర్డర్లు సిరిసిల్లకు అందించేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జిల్లా అభివృద్ధి ఆగదని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేస్తుందని అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజా మనోహర్ రావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు విజయలక్ష్మి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, దళిత సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వేములవాడలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.వేములవాడ పట్టణంలో రూ. 30 లక్షలతో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ భాగంగా నూతన అంబేద్కర్ చౌరస్తా,కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గీతే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూఅంబేద్కర్ జయంతి సందర్భంగా వేములవాడ లోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోకాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ అంబేద్కర్ చౌరస్తా వద్ద కొత్త శోభ సంతరించుకొనేలా రూ .30 లక్షల తో కూడలి అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవ తీసుకుని కూడలిని అభివృద్ధి చేయించారని అన్నారు. ఒక బిసి బిడ్డగా ఎవరూ అడగకున్న తాను అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించానని అన్నారు. అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు అందించారని,

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ఆమోదం తెలిపిందని, 30 సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నా ఎస్సి వర్గీకరణ చేయడం జరిగిందని అన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్సి వర్గీకరణ అమలు చేయబోతున్నామని, వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎకరం భూమి సేకరించి, నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వేములవాడ అభివృద్ధి చేయిస్తానని స్పష్టం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి గత బడ్జెట్ లో రూ.50 కోట్లు, ఇటీవల బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించిందని అన్నారు. అన్నదాన సత్రం రూ.35 కోట్లతో నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని, వేములవాడ పట్టణ అభివృద్ధి, రాజన్న ఆలయ అభివృద్ధి రెండు కళ్ళల ముందుకు పోతున్నామని అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారంగా రాజన్న ఆలయ అభివృద్ధి , శృంగేరిపీఠాధిపతి,బ్రాహ్మణుల నుండీ సూచనల తీసుకొని ముందుకు పోతున్నామని అన్నారు. రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేయిస్తామని,రాజన్నకు ప్రతి రోజూ జరిగే ప్రతి పూజలు యదావిధిగా జరుగుతాయని, త్వరలో నే రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు.

వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో 80లక్షలతో కూరగాయల మార్కెట్ సముదాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంస్య విగ్రహాన్ని తన చేతుల మీదగా ఆవిష్కరణ చేయడం పూర్వ జన్మ సుకృతమని,రాబోవు రోజుల్లో వేములవాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు అనంతపల్లి, కొత్తపేట, గ్రామలలో అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి మరియు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. కొత్తపేట గ్రామంలో బాలయ్య, రాజేష్, నారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతపల్లి గ్రామంలో అధ్యక్షులు బావాండ్ల కమలాకర్, మాజీ సర్పంచ్ జంగా సత్యం, మాజి ఎంపిటిసి వంగపల్లి రాజిరెడ్డి, పురుషోత్తము రెడ్డి, డైరక్టర్ తిరుపతిరెడ్డి, గడ్డం వినయ్, తోడిటి చంటి,పర్శరాములు, మదు,పంచాయతీ కార్యదర్శి అనిల్, అరేపల్లి మదు, మండల అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు మల్లారపు చందు, కన్నం హనుమయ్య, రెయికంటి దుర్గయ్య,గంగాధర కరుణాకరు, గంగాధర అంజయ్య, నితిన్, మనోజ్,సుదర్శన్ పాల్గొన్నారు.



## ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా
# సౌరవ్ గంగూలీ పున: నియామకం

**బలగం టీవి, హైదరాబాద్**

ఐసీసీ మెన్స్ క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పునర్నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని ఐసీసీ గ్లోబల్ గవర్నింగ్ బాడీ ఆదివారం ప్రకటించింది. గంగూలీ దీర్ఘకాల సహచరుడు వీవీఎస్ లక్ష్మణ్ కూడా ప్యానెల్ సభ్యులలో ఒకరిగా మళ్లీ ఎంపికయ్యారు. 2000 నుండి 2005 వరకు భారత జట్టుకు నాయకత్వం వహించిన గంగూలీ 2021లో తొలిసారి ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. నాటి నుంచి గంగూలీ ఈ పదవిలో కొనసాగుతున్నారు. 52 ఏళ్ల గంగూలీ భారత లెజెండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే నుండి ఈ పదవిని స్వీకరించారు. కుంబ్లే గరిష్ఠంగా అనుమతించబడిన మూడు మూడు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసిన తర్వాత పదవీ విరమణ చేశారు. గంగూలీ, లక్ష్మణ్‌లతో పాటు కొత్తగా ఏర్పాటు చేయబడిన కమిటీలో ఆఫ్ఘనిస్తాన్ మాజీ ఆటగాడు హమీద్ హసన్, వెస్టిండీస్ బ్యాటింగ్ ఐకాన్ డెస్మండ్ హేన్స్, దక్షిణాఫ్రికా ప్రస్తుత టెస్ట్ మరియు వన్డే జట్టు కెప్టెన్ టెంబా బవుమా, ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ జోనాథన్ ట్రాట్ ఉన్నారు.

మహిళల క్రికెట్ కమిటీ విషయానికొస్తే.. న్యూజిలాండ్ మాజీ ఆఫ్ స్పిన్నర్ కేథరిన్ క్యాంప్‌బెల్ ఛైర్ పర్సన్‌గా ఎంపిక కాగా, ఆస్ట్రేలియా మాజీ క్రీడాకారిణి అవ్రిల్ ఫాహే, క్రికెట్ దక్షిణాఫ్రికా ఫోలెట్సి మోసేకి ఇతర సభ్యులుగా ఉన్నారు.

అఫ్ఘనిస్తాన్ మహిళా క్రికెటర్ల భవితవ్యంపై ఐసీసీ కీలక చర్య తీసుకుంది. తాలిబన్ల పాలన ప్రారంభమైన తర్వాత తీవ్రంగా ప్రభావితమైన ఆఫ్ఘనిస్తాన్ మహిళా క్రికెట్‌కు పునరుజ్జీవనం కలిగించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. తాలిబన్ పరిపాలనలో మహిళలు క్రీడల్లో పాల్గొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కొందరు ఆఫ్ఘనిస్తాన్ మహిళా క్రికెటర్లు ఆస్ట్రేలియా లాంటి దేశాలకు శరణార్థులుగా వెళ్లి క్రికెట్ ఆడుతున్నారు. ఇలాంటి వారితో పాటు క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే ఆఫ్ఘనిస్తాన్ యువతులకు మద్దతుగా ఐసీసీ ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఆఫ్ఘన్ మహిళా క్రికెట్‌కు మద్దతు నిధిని ప్రారంభిస్తున్న విషయాన్ని ఐసీసీ అధ్యక్షుడు జై షా ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు.




# అల్కరాజ్ టైటిల్ కైవసం

**బలగం టీవి, హైదరాబాద్**

మొనాకోలో జరిగిన మాంటే కార్లో మాస్టర్స్‌లో టెన్నిస్ యువకెరటం కార్లోస్ అల్కరాజ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో ఇటలీకి చెందిన లొరెంజో ముసెట్టిని చిత్తుగా ఓడించాడు. తొలి సెట్ కోల్పోయిన అల్కరాజ్.. ఛాంపియన్ ఆటతో ప్రత్యర్థికి చెమటలు పట్టించాడు. వరుసగా రెండు సెట్లు గెలుపొంది ట్రోఫీని ముద్దాడాడు. దాంతో, ఆరోసారి ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడీ స్పెయిన్ స్టార్. గత ఏడాది ఇండియన్ వెల్స్ మాస్టర్స్ ట్రోఫీ తర్వాత అల్కరాజ్‌కు ఇదే గర్వించదగ్గ విజయం కావడం గమనార్హం. మొత్తంగా చూస్తే.. గ్రాండ్‌స్లామ్స్‌తో కలిపి ఇది అతడికి 18వ టైటిల్.

# చెన్నై గెలుపు

- 5 వికెట్ల తేడాతో లక్నోపై చెన్నై విజయం
- ధోనీ, దూబే ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో విజయాల బాట

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ రెండో విజయాన్ని సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో సోమవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసింది. రిషభ్ పంత్(49 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30), అబ్దుల్ సమద్(11 బంతుల్లో 2 సిక్స్‌లతో 20) కీలక ఇన్నింగ్స్ ఆడారు. చెన్నై బౌలర్లలో రవీంద్ర జడేజా(2/24), మతీష పతీరణ(2/45) రెండేసి వికెట్లు తీయగా.. ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్ చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ(11 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. శివమ్ దూబే(37 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43 నాటౌట్), రచిన్ రవీంద్ర(22 బంతుల్లో 5 ఫోర్లతో 37), అరంగేట్ర ప్లేయర్ షేక్ రషీద్(19 బంతుల్లో 6 ఫోర్లతో 27) రాణించారు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో రవి బిష్ణోయ్(2/18) రెండు వికెట్లు తీయగా.. దిగ్వేజ్ రతి, ఆవేశ్ ఖాన్, ఎయిడెన్ మార్క్‌రమ్ తలో వికెట్ తీసారు.



### తెలుగు తేజం షేక్ రషీద్ దూకుడు

లక్ష్యచేధనలో సీఎస్‌కేకు ఓపెనర్లు షేక్ రషీద్, రచిన్ రవీంద్ర శుభారంభం అందించారు. ముఖ్యంగా అరంగేట్ర ప్లేయర్, తెలుగు తేజం షేక్ రషీద్ దూకుడుగా ఆడాడు. 6 బౌండరీలతో వేగంగా పరుగులు రాబట్టాడు. అయితే అతన్ని ఆవేష్ ఖాన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చడంతో తొలి వికెట్‌కు నమోదైన 52 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

# హిట్ 3 ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ నాని నటిస్తోన్న తాజా చిత్రం హిట్ 3. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఉంటే భూమి మీద 10 అడుగుల సెల్‌లో ఉండాలి.. లేదంటే భూమిలో ఆరడుగుల లోతులో ఉండాలి.. ఏ క్రిమినల్ కూడా సొసైటీలో ఫ్రీగా తిరగడానికి వీల్లేదు. అలా ఫీలవ్వడానికి పర్సనల్‌గా ఎఫెక్ట్ అవ్వాల్సిన అవసరం లేదు సార్.. పోలీసోడైతే చాలు అంటూ అర్జున్ సర్కార్ చెబుతున్న సంభాషణలతో షురూ అయింది ట్రైలర్. 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని నాని హోం బ్యానర్ వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి త్రిపురనేని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో స్టైలిష్‌గా కనిపిస్తూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.







# మార్క్ శంకర్ పేరిట పవన్ సతీమణి భారీ విరాళం..

**బలగం టీవి, హైదరాబాద్**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కొడుకు మార్క్ శంకర్ ఇటీవల సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తృటిలో గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. మార్క్ శంకర్ కోలుకోవడంతో పవన్ కల్యాణ్ తన భార్య, కొడుకు, కూతురితో హైదరాబాద్‌కి వచ్చారు.ఇక హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలకి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సుప్రభాత సేవలో కూడా పాల్గొన్నారు. తాజాగా తిరుమల శ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాదానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణి విరాళం అందించారు. తన కుమారుడు మార్క్ శంకర్ పేరు మీద రూ.17 లక్షల విరాళం ఇచ్చారు అన్నా లేజినోవ..మార్క్ శంకర్ పేరు మీద ఈ రోజు భక్తులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించింది టీటీడీ పాలక మండలి. నిత్యాన్నదాన సత్రంలో శ్రీవారి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి అనంతరం భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

కాగా కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని సోమవారం వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో అన్నా కొణిదల కి వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆమె శ్రీవారికి తలనీలాల సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.



# సల్మాన్‌కు బెదిరింపులు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. కారును పేల్చేస్తామని, సల్మాన్‌ను తుదముట్టిస్తామని ఆగంతకులు సోమవారం బెదిరించారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున ( ఎప్రిల్ 14న) ముంబై బాంద్రాలోని సల్మాన్ ఖాన్ బంగళా వెలుపల దుండగులు పలుసార్లు కాల్పులు జరిపి ఫరారయ్యారు. సల్మాన్‌ను హత్య చేసి తీరుతామని, ఇది కేవలం సంకేత ఘట్టం అని తరువాత ప్రకటించారు. దీనితో ఈ నటుడికి భద్రతను పెంచారు. సల్మాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి అనేక సార్లు బెదిరింపులు వచ్చాయి. సల్మాన్ కారును టార్గెట్ చేసుకుంటామని ఈ క్రమంలో ఆయన అంతం తప్పదని ఆగంతకుల నుంచి ఫోన్‌కాల్ రావడంతో భద్రత పెంచారు. వర్లీ పోలీసు స్టేషన్‌లో సంబంధిత విషయంపై కేసు దాఖలు అయింది. బెదిరింపుపై పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సల్మాన్ నివాస ప్రాంతాలలో సిసికెమెరాల పటిష్టత, నిరంతర నిఘా జాగరూకత ఎక్కువ చేశారు. హీరో కారులో వచ్చి పోయే సమయం చూసుకుని బాంబు విసురుతామని బెదిరింపుదార్లు హెచ్చరించడం కలకలం రేపింది.

# ‘తు మేరా లవర్’ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం ‘మాస్ జాతర’. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా ‘తు మేరా లవర్’ను విడుదల చేశారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ‘తు మేరా లవర్’ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. భాస్కరభట్ల సాహిత్యం మాస్ మెచ్చేలా ఉంది. రవితేజ బ్లాక్‌బస్టర్ చిత్రం ‘ఇడియట్’లోని ఐకానిక్ చార్ట్‌బస్టర్ ”చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే” పాటకు ట్రిబ్యూట్ గా మలిచిన ఈ పాట విందు భోజనంలా ఉంది.